పారిశుధ్యంపై పట్టింపేది?

- గంగాస్థాన్‌లో అధ్వానంగా డ్రెయినేజీలు
- ఖాళీ ప్రదేశాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో కాలనీవాసులు


రోడ్డుపై లీకేజీ అవుతున్న డ్రెయినేజీ


గంగాస్థాన్ హైవే పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం

నిజామాబాద్ రూరల్: నగరంలోని గంగాస్థాన్ ఫేస్–1, ఫేస్–2లలో పారిశుధ్యం పడకేసింది. అధ్వాన డ్రెయినేజీలు, పేరుకుపోయిన చెత్తాచెదారంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుచోట్ల డ్రెయినేజీ నీళ్ల రోడ్లపై ప్రవహించడంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. గంగాస్థాన్‌లోని ఖాళీ ప్రదేశాలల్లో దట్టమైన చెట్లు పెరిగి అడవిని తలపిస్తున్నాయి. అయినా అధికారులు మాత్రం ఏమీ పట్టనట్లు వ్యవహరించడంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల ఆరోగ్యంతో చెలగాటం..

గంగాస్థాన్‌లోని డ్రెయినేజీల లీకేజీలు, పరిసరాల్లో వ్యర్థాలు పేరుకుపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్తకుప్పలు అలానే ఉంటే ప్రజలు రోగాలబారిన పడే అవకాశం ఉంటుందని వైద్యులు పేర్కొంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో పారిశుధ్య కార్మికులు డ్రెయినేజీలను శుభ్రం చేయడంలో అలసత్వం చూపుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గంగాస్థాన్ హైవే పక్కన చెత్తను డంప్ చేయడంతో పరిసరాల్లో దుర్గంధం వెదజల్లుతోంది. అదేవిధంగా గంగాస్థాన్ లోపలి గల్లీ ప్రధాన కూడలీ వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఏర్పాటు చేశారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. అలాగే ప్రధాన కూడళ్ల మూలమలుపుల వద్ద రెండు, మూడు ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలనీలో డ్రెయినేజీ లీకేజీలను అరికట్టాలని, ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

శుభ్రతపై శ్రద్ధ చూపాలి..



నగరంలో అనేక ప్రాంతాల్లో చెత్త అలానే ఉంటుంది. అధికారులు పట్టించుకోకుండా ప్రజల ఆరోగ్యాలతో చలగాటం ఆడుతున్నారు. డ్రెయినేజీలు లీకేజీలు కావడంతో మురికినీరు రోడ్లపై పారుతుంది. దీంతో దోమలు ఎక్కువై ప్రజలు రోగాలబారిన పడే అవకాశం ఉంది. అధికారులు తక్షణమే నగర శుభ్రతపై శ్రద్ధ వహించాలి.

– బిల్ల లింబాద్రి, నగరవాసి

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

- నేలకొరిగిన వరి
- చేతికొచ్చిన పంట వర్షార్పణం కావడంతో రైతుల ఆందోళన


తాడెం గ్రామశివారులో నేలకొరిగిన వరి పంట

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలో శనివారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి పలు గ్రామాల్లో రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయ్యింది. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని రైతులు రోడ్లు, టార్పాలిన్లలో ఆరబెట్టారు. చివరికి వర్షానికి తడిసిపోయింది. పలువురు రైతులు టార్పాలిన్లను కప్పి ఉంచారు. వర్షం తగ్గుముఖం పట్టిన తర్వాత తడిసిన ధాన్యాన్ని అన్నదాతలు ఆరబెట్టారు. అంతేగాకుండా పలు గ్రామాల్లో వరి నేలకొరిగింది. పంట చేతికొచ్చే సమయంలో వర్షానికి తడిసి ముద్దవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్‌చేస్తున్నారు.

14,195 ఎకరాల్లో వరి..

మండలంలో 14,195 ఎకరాల్లో వరి పంట సాగుచేశారు. ఇప్పటికే 9వేల ఎకరాల పంట కోత పూర్తయ్యింది. బోర్గాం(పి), మోపాల్, బాడ్సి సొసైటీల ద్వారా ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు చేపడుతోంది. ఈసారి రైతులు సన్నరకం పంట సాగు చేయడంతో దళారులు కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌లో మంచి ధర రావడంతో వారికే విక్రయించేందుకు మొగ్గుచూపుతున్నారు. కాగా అకాల వర్షంతో ఒకవైపు వరి కోతలు నిలిచిపోగా, మరోవైపు ధాన్యం సేకరణ కూడా నిలిచిపోయింది. మరో రెండ్రోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు పేర్కొనడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షానికి ధాన్యం తడిసి తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వమే ఆదుకోవాలని వారు కోరుతున్నారు.


మోపాల్‌లో ధాన్యంపై కప్పిన టార్పాలిన్లు


కంజర్ శివారులో తడిసిన ధాన్యం


కంజర్ వెళ్లే రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం

సమాచారం..

నేడు నగరంలో కరెంట్ కోత

నిజామాబాద్‌నాగారం: నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ ఆపరేషన్ టౌన్–2 తోట రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. తిలక్ గార్డెన్ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో మరమ్మతులు చేపట్టనుండటంతో ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఖలీల్‌వాడీ, రాష్ట్రపతి రోడ్డు, గాంధీ చౌక్, నెహ్రూపార్క్, హెడ్ పోస్ట్‌ఆఫీస్, కుమార్‌గల్లీ, హత్‌హాయ్ గల్లీ, టౌన్ 1 పోలీస్‌స్టేషన్, సరస్వతి నగర్, ప్రగతినగర్, పోచమ్మగల్లీ, ద్వారకా నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలన్నారు.

జక్రాన్‌పల్లిలో బీఆర్‌ఎస్ సమావేశం

జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలో ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు నట్ట భోజన్న ఒక ప్రకటనలో తెలిపారు. జక్రాన్‌పల్లి గౌడ సంఘం ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 2.30 గంటలకు జరిగే ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే, నిజామాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, జెడ్పీ చైర్మన్ విఠల్ రావు, మాజీ ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్, ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్‌లు హాజరు కానున్నట్లు తెలిపారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అర్గుల్‌లో కాంగ్రెస్ సమావేశం

జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్ గురడిరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం మండల స్థాయి కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం ఉంటుందని పార్టీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ సమావేశానికి ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ, నిమాజాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. సమావేశానికి మండలంలోని నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

14న ఉచిత గ్రాండ్ టెస్ట్

తెయూ(డిచ్‌పల్లి): గ్రూప్–2, ఎస్‌ఐ, కానిస్టేబుల్ పరీక్షలకు సన్నద్ధనవుతున్న అభ్యర్థులకు ఈ నెల 14న తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఐఏసీఈ వారి సౌజన్యంతో గ్రాండ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు వర్సిటీ గిరిజన శక్తి విద్యార్థి సంఘం అధ్యక్షుడు శ్రీను నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గ్రూప్–2 పరీక్ష ఉదయం 10గం.ల నుంచి మధ్యాహ్నం 1.గం. వరకు, ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు మధ్యాహ్నం 2గం.ల నుంచి సా.5గం.ల వరకు పరీక్ష ఉంటుందన్నారు.

సంక్షిప్తం

సీఎంను కలిసిన నాయకులు



జక్రాన్‌పల్లి/ ఖలీల్‌వాడి: సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని తన నివాసంలో శనివారం జిల్లా సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు గోర్త రాజేందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర మున్నురుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర మున్నురుకాపు సంఘం అధ్యక్షుడు దేవన్న, రాజేందర్‌లు సీఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ ఎస్సీ స్టడీ సర్కిల్స్‌లో కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులకు శనివారం డాక్టర్ బిఎస్ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు ఉపయోగపడే స్టడీ మెటీరియల్స్‌ను అందజేశారు. స్టడీ సర్కిల్ డైరెక్టర్ రాజాగంగారాం, గిరి రాజ్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ వేణు, అధ్యాపకులు సంతోష్, రమేష్, రమణ ఉన్నారు

విద్యార్థులకు నోట్‌బుక్స్..



మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని పలు పాఠశాలల్లో శనివారం విద్యార్థులకు తపస్ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. తపస్ ప్రతినిధులు బట్టు బద్రినాథ్, గంగయ్య, గంగాధర్, నాగరాణి, స్వప్న పాల్గొన్నారు.

ఎకరాకు రూ. 30వేలు పరిహారం ఇవ్వాలి

వర్ని(మోస్రా): అకాల వర్షానికి నేలకొరిగిన పంటలను సీపీఎం నేతలు నన్నేసాబ్, మేకల మల్లేష్ రైతులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ మాట్లాడుతూ.. పంట నష్టపోయిన బాధిత రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ. 30 వేలు పంట నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధిత రైతులకు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో రైతులు నర్సయ్య, మోహన్, సిరాజుద్దీన్, సాయిలు, బోయిడి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపన



నిజామాబాద్‌రూరల్: ముబారక్‌నగర్‌లోని అభయ ఆంజనేయ స్వామి శివ పంచాయతన నవ గ్రహ సహిత విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకులు రణదీప్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అంతకుముందు జెడ్పీ చైర్మన్ దాదాన్నగారి విఠల్‌రావు వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. నేడు ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, సామూహిక కుంకుమార్చన, శివపార్వతుల శాంతి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మధుసుధన్‌రావు, నాయకులు రమణారావు, నీలం రెడ్డి, లక్ష్మిప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

పెర్కిట్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని చౌడేశ్వరి మాత ఆలయ వార్షికోత్సవ వేడుకలను కొటార్మూర్ దేవాంగ సంఘం సభ్యులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు అన్నదానం చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవాంగ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీతో బీడీ కార్మికులకు అన్యాయం

వర్ని(మోస్రా): కేంద్రంలో ఉన్న బీజేపీతో బీడీ కార్మికులకు అన్యాయం జరుగుతోందని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్ అన్నారు. మండలంలోని తిమ్మాపూర్‌లో బీడీ కార్మికులతో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బీడీలపై 27 శాతం జీఎస్టీ విధించి పరిశ్రమను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. కేంద్ర వ్యవహరిస్తున్న తీరుపై బీడీ కార్మికులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. బీడీ కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధిని కల్పించకుండా కార్మికుల పొట్ట కొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. బీడీ కార్మికులకు ఈపీఎఫ్ పెన్షన్ పెంచి కార్మికులకు రావాల్సిన పిఎఫ్ డబ్బులను చెల్లించాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

పెర్కిట్: ఆర్మూర్ మండలం చేపూర్‌కు చెందిన మాజీ ప్రజా ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి సమక్షంలో చేపూర్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ జన్నెపల్లి గంగాధర్, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్‌తో పాటు వార్డు సభ్యులు, నాయకులు పార్టీలో చేరారు. వీరికి వినయ్‌రెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ రాష్ట్ర నాయకుడు మార చంద్రమోహన్, విఠం జీవన్, గంగారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

'బీజేపీ గెలుపు కోసం కృషి చేయాలి'



ఇందల్వాయి: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్ అన్నారు. చాయ్ పే చర్చ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన మండలంలోని నల్లవెల్లి గ్రామంలో మండలస్థాయి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ భారీ మెజారిటీతో గెలిచేలా కృషి చేయాలన్నారు. బూత్‌స్థాయిలో ప్రతీ ఓటరుకు కేంద్ర ప్రభుత్వ పథకాలు వివరించాలన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ప్రజల నమ్మకం కోల్పోయాయని, ఇచ్చిన హామీలు అమలు చేయడంలో రెండు పార్టీలు విఫలం చెందాయన్నారు. అనంతరం సిర్నాపల్లి గ్రామంలో పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. పార్టీ ప్రతినిధులు నాయిడి రాజన్న, గద్దె భూమన్న, చిన్ను, ఉప్పు సవిత, కొట్టూరి సురేష్, మనోహర్, సక్కి శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, జగత్‌సింగ్ పాల్గొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ నేతల పేర్లు బహిర్గతం చేయాలి



ఖలీల్‌వాడి: ఫోన్ ట్యాపింగ్ విషయంలో ముఖ్య రాజకీయ నాయకుల పేర్లు బయటకు తీయకపోవడం సిగ్గుచేటని, వెంటనే వారి పేర్లను బహిర్గతం చేయాలని టీడీపీ నిజామాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యదాగౌడ్ పేర్కొన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో చట్టాన్ని కాపాడాల్సిన ప్రభుత్వ అధికారులందరూ భాగం అవ్వడం సిగ్గుచేటన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాలనలో జరిగిన ఈ వ్యవహారంపై ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టి నిందితులపై చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. నాయకులు అంబిక సత్యనారాయణ, రెంజర్ల సురేష్, బొబ్బ నరసింహరావు, కల్లెద గంగాధర్, శంకర్, రాములు, మల్లారెడ్డి, జాఫర్, విష్ణు, హరీష్, బాలకృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ మారడమంటే ద్రోహం చేయడమే



సిరికొండ: బీఆర్‌ఎస్ పార్టీ గుర్తు మీద పోటీ చేసి జెడ్పీటీసీగా గెలిచి ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో చేరడం ద్రోహం చేయడమేనని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నారపోయిన శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జెడ్పీటీసీ మాన్‌సింగ్‌కు అప్పటి ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేశారని తెలిపారు. ఆపత్కాలంలో పార్టీని వదిలి వెళ్లడం సరైన పద్ధతి కాదన్నారు. ఆయన జెడ్పీటీసీ పదవికి రాజీనామా చేయాలని కోరారు. వైస్ ఎంపీపీ రాజన్న, నాయకులు రాజేందర్, సురేందర్, రఘువాస్, బాలరాజు, మహేందర్, గంగనర్సయ్య, రంజిత్, సాయిచరణ్, రాజు, సంతోష్, దేవిదాస్, గంగాధర్ ఉన్నారు.

చట్టాలపై అవగాహన



ధర్పల్లి: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు శనివారం చట్టాలపై అవగాహన కల్పించారు. 'పీఎంశ్రీ' కార్యక్రమంలో భాగంగా జిల్లా సీనియర్ న్యాయవాదులు ముఖ్య అతిథులుగా హాజరై 'న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు' నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ.. చట్టం ముందు అందరూ సమానమే అని పేర్కొన్నారు. బాల కార్మిక నిరోధక చట్టం, బాల్య వివాహ చట్టాలు, సమాచార హక్కు చట్టం తదితర చట్టాల గురించి అవగాహన కల్పించారు. న్యాయవాదులు చెలిమెల రాజేశ్వర్, నీరాజా రెడ్డి, కవితా రెడ్డి, రజని ఉపాధ్యాయులు సబితా రాణి, మంజుల, కవిత, రాధిక తదితరులు పాల్గొన్నారు.

నేటి చిత్రం..


నగరంలోని ముబారక్‌నగర్ వద్ద కూలిపోయిన డివైడర్

మరమ్మతులు చేయించండి

నగరంలోని ముబారక్‌నగర్ వద్ద డివైడర్లు నాసిరకంగా నిర్మించడంతో చిన్న ప్రమాదాలకే కుప్పకూలుతున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి, డివైడర్లు నాణ్యతగా నిర్మించి, ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు. –సాక్షి స్టాఫ్ ఫోటోగ్రాఫర్, నిజామాబాద్

మేడే పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నిజామాబాద్‌నాగారం/ఖలీల్‌వాడి: నగరంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో శనివారం ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే పోస్టర్లను సంఘ నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య మాట్లాడుతూ.. మేడే వేడుకలను ఏఐటీయూసీ అనుబంధ సంఘాల కార్మికవర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న 50 కోట్ల మంది కార్మికులకు సమగ్రమైన సంక్షేమ చట్టాన్ని తీసుకురావడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. జిల్లా అధ్యక్షుడు నర్సింగరావు, నాయకులు హనుమాండ్లు, అనిల్, దేవేందర్, చక్రపాణి, సాయిలు, భాగ్యలక్ష్మి, కవిత తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతల పూడ్చివేత

సాక్షి ఎఫెక్ట్..


గుంతను పూడ్చి వేసిన రోడ్డు

సిరికొండ: మండలంలోని సర్పల్లితండా సమీపంలో ప్రధాన రహదారిపైగల కల్వర్టు వద్ద రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే ఈ దారిలో రోడ్డు కోతకు గురై, గుంతలమయంగా మారింది. రోడ్డు దుస్థితిపై ఈ నెల 7న సాక్షిలో 'రహదారులకు మరమ్మతులు కరువు' పేరిట కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు కల్వర్టు వద్ద కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేయించారు. రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చితారు వేశారు. రోడ్డు బాగవడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అగ్ని ప్రమాదాలపై జాగ్రత్త వహించాలి

ఆర్మూర్‌టౌన్: అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు భయందోళనకు గురికాకుండా జాగ్రత్తలు పాటిస్తే వాటిని నివారించవచ్చని ఏసీపీ బస్వారెడ్డి అన్నారు. పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన అగ్నిమాపక వారోత్సవాల గోడప్రతులను ఏసీపీ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు కొనసాగనున్నాయని అన్నారు. ఈ వారోత్సవాల్లో అధికారులు అగ్నిప్రమాదం సంభవిస్తే తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించనున్నట్లు పేర్కొన్నారు. ఎస్‌ఎఫ్‌వో మధుసూదన్‌రెడ్డి, ఎల్‌ఎఫ్ ప్రకాశ్, అనంతరావు, వంశీ ఉన్నారు.

బోధన్‌లో..

బోధన్‌టౌన్: మండలంలోని ఆర్డీవో కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాల వాల్ పోస్టర్లను ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్ శనివారం ఆవిష్కరించారు. అగ్నిమాపక శాఖ స్టేషన్ ఆఫీ సర్ గంగదాస్, సిబ్బంది నర్సయ్య, అహ్మద్, రషీద్ ఉన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	75,700	వెండి (కిలో)	87,000
22 క్యారెట్స్	69,835	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	10	20	గాజరుగడ్డ	30	50
బెండకాయ	20	40	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	30	50	దోసకాయ	15	30
దొండకాయ	20	40	ఆలుగడ్డ	16	30
బీర్నిసుకాయ	30	60	గోబిగడ్డ	15	30
కాకరకాయ	40	60	గోబిపువ్వు	30	50
వంకాయ	40	60	బీట్‌రూట్	20	40
పాలకూర	15	30	కరివేపాకు	40	60
మెంతికూర	20	40	చామగడ్డ	50	70
కొత్తిమీర	40	60	గోరుచిక్కుడు	30	50
పుదీనా	40	60	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	గీతాంజలి మళ్ళీ వచ్చింది-10.40 టిల్లు స్క్వేర్(తెలుగు)- 1.30, ది ఫ్యామిలీ స్టార్(తెలుగు)- 4.20, 7.30
స్క్రీన్-2	మంజుమ్మల్ బాయ్స్ (తెలుగు) - 11.00, గీతాంజలి మళ్లీ వచ్చింది (తెలుగు) - 1.30, 7.35 బడే మియా చోటే మియా(హిందీ)-4.30, 10.25
స్క్రీన్-3	డేర్ (తెలుగు)- 10.30, మంజుమ్మల్ బాయ్స్ (తెలుగు)- 1.45, 4.45, 10.45 మైదాన్ (హిందీ) - 7.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	మైదాన్ (హిందీ)- 9.15, ది ఫ్యామిలీ స్టార్(తెలుగు)- 1.05, 10.30 టిల్లు స్క్వేర్(తెలుగు)- 4.30, 7.30
స్క్రీన్-2	బడే మియా చోటే మియా- 10.00, 7.05, గాడ్జిల్లా ఎక్స్ కాంగ్(3డీ)- 1.30, గీతాంజలి మళ్ళీ వచ్చింది - 4.05 బడే మియా చోటే మియా (3డీ హిందీ)- 10.35
స్క్రీన్-3	లవ్‌గురు(తెలుగు)-10.15, 7.15, మంజుమ్మల్ బాయ్స్- 1.25, 4.20, గీతాంజలి మళ్ళీ వచ్చింది -10.25
స్క్రీన్ -4	మైదాన్ (హిందీ)- 12.00, మంజుమ్మల్ బాయ్స్ (తెలుగు) - 3.50, 6.35, లవ్ గురు (తెలుగు)-10.25
దేవి	టిల్లు స్క్వేర్ (తెలుగు)
నటరాజ్	బడే మియా చోటే మియా (హిందీ) - 11.00 6.00, మైదాన్ (హిందీ)- 2.00 6.00
లలితామహల్	ది ఫ్యామిలీ స్టార్ (తెలుగు)
విజయ్	గీతాంజలి మళ్ళీ వచ్చింది(తెలుగు)